క్లుప్తంగా

చౌడేశ్వరమ్మ ఆలయంలో కలశ పూజ



తవణంపల్లె: మండలంలోని అరగొండ పంచాయతీ రెడ్డిపల్లె మిట్ట దగ్గర ఉన్న పురాతన చౌడేశ్వరమ్మ ఆలయంలో గురువారం భక్తిప్రపత్తులతో కలశ పూజ నిర్వహించారు. దాత అపోలో హాస్పిటల్ అధినేత డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి సొంత నిధులు రూ.1.5 కోట్ల అంచనాతో చౌడేశ్వరమ్మ ఆలయ జీర్ణోద్ధారణ పనులకు పూజలు చేసి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా కలశపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, వైఎస్సార్సీపీ నాయకురాలు రాజేశ్వరమ్మ, రామకృష్ణారెడ్డి, కిషోర్ రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ



ఐరాల: మండలంలోని పాతపాళ్యం పాఠశాలను గురువారం ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, రిజిష్టర్లు, ఉపాధ్యాయుల డైరీని పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థుల వర్క్‌బుక్స్, నోట్ బుక్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరిసరాలు, టాయిలెట్లను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు.

మధ్యాహ్న భోజన తనిఖీ



పూతలపట్టు: మండలంలోని మన్నూరుపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంపీడీఓ గౌరి పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కొంతసేపు పిల్లలతో ముచ్చటించారు. మధ్యలో బడి మానేసిన పిల్లలతో ఆమె మాట్లాడారు. యథావిధిగా మానేసిన తరగతి నుంచి కొనసాగించాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేశారు. అనంతరం పోలవరంలోని డ్రైనేజీ పైపుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాపసముద్రంలో రీసర్వే



గుడిపాల: మండలంలోని పాపసముద్రం పంచాయతీలో గురువారం తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రీసర్వే రాళ్లను నాటారు. తహసీల్దార్ మాట్లాడుతూ పాపసముద్రం పంచాయతీలో భూ రీసర్వేలో భాగంగా రాళ్లు నాటుతున్నట్లు తెలిపారు. ఎవరైనా రాళ్లను తొలగించినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సర్వేయర్ వంశీకష్ణ, సర్వేయర్లు గణేష్, కిరణ్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు కార్పొరేషన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార గోడపత్రికలను గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు చిత్తూరులో ఆవిష్కరించారు. ఎన్నికల ప్రచారం వేగవంతం చేయాలని నాయకులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు, మాజీ ఎంపీ దుర్గా నాయకులు షణ్ముగం, గోకుల్, రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

పూతలపట్టు: సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి మండల ప్రజాప్రతినిధులు, మండల వివిధ శాఖల అధికారులు, పంచాయతీ స్థాయి అధికారులు, హాజరుకావాలని కోరారు.

ఇంటర్ ఓపెన్ అడ్మిషన్లు ప్రారంభం

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఓపెన్ స్కూల్ మంజూరైందని ఇందుకు గాను 2022–23 సంవత్సరానికి సంబంధించి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌చంద్రశేఖర్ తెలిపారు. సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమైందన్నారు. గతంలో పదవ తరగతి పాసై డ్రాప్ అయిన విద్యార్థులు, ప్రస్తుతం ఇంటర్ మీడియట్ చదువుకోవాలనుకొని ఆసక్తి ఉన్నవారు ఈనెల 27వ తేదీలోపు అడ్మిషన్ పొందవచ్చని చెప్పారు.

దివ్యాంగులకు అభయం

- మండలానికో భవిత కేంద్రం
- ప్రతి సోమవారం ఫిజియోథెరపీ సేవలు
- ఉచితంగా పరికరాల పంపిణీ



భవిత కేంద్రంలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు



చిన్నారికి వ్యాయామం చేయిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు

బంగారుపాళెం: దివ్యాంగుల భవితకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. మండల కేంద్రాల్లో ప్రత్యేక భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి వారిని సాధారణ పిల్లల మాదిరిగా తీర్చిదిద్దుతోంది. వారిలో సృజనాత్మకతను వెలికితీసేలా ముందుకు పోతోంది. సాధారణ పిల్లలతో కలిసి సాగేలా చర్యలు చేపడుతోంది. ఇంటి వద్దనే చేసుకోవడానికి వీలయ్యే స్థాయిలో ఫిజియోథెరపీ అందిస్తోంది. ప్రతి గురువారం బంగారుపాళెం భవిత కేంద్రంలో, సోమ వారం, మంగళ, బుధ, శుక్రవారాల్లో తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, యాదమరి మండలాల్లో ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు ప్రతి శనివారం ఇంటి వద్దకే విద్య అనే కార్యక్రమం ద్వారా వారికి ప్రత్యేక పద్ధతుల్లో పాఠాలను బోధిస్తున్నారు.

ప్రతి మండలంలో సేవలు

పూతలపట్టు నియోజకవర్గంలో ఐదు మండలాల్లో ఐదు భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 638 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 98 మంది భవిత కేంద్రాలకు వస్తున్నారు. 540 మంది విద్యార్థుల్లో కొంత మంది ఇంటి వద్ద మరికొంత మంది ఇతర పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ప్రస్తుతం 98 మంది విద్యార్థులకు ఐఈఆర్టీలు(ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్), ఆయాలను నియమించారు. ఈ కేంద్రాలకు వారానికి ఒకసారి ఫిజియోథెరపీ ట్రైనర్ వచ్చి వ్యాయామం చేయిస్తారు. దీంతో పాటు ఇంట్లో వ్యాయామం ఎలా చేయించాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ప్రతి శనివారం నడవలేని పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన అంశాలను తెలియజేస్తారు.

మండలం పేరు	భవిత కేంద్రానికి వచ్చే పిల్లలు
బంగారుపాళెం	25
తవణంపల్లె	23
యాదమరి	20
పూతలపట్టు	15
ఐరాల	15

భవిత కేంద్రాలలో అందుతున్న సేవలు

- మానసిక దివ్యాంగులకు రూ.14 వేల విలువైన ఎంఆర్ కిట్స్ ఉచితంగా అందిస్తారు.
- మధ్యాహ్న భోజనంతో పాటు బస్సు పాసులను ఇస్తారు.
- వేల రూపాయలు విలువ చేసే హియరింగ్ మిషన్లు, మూడు చక్రాల కుర్చీలు తదితర వాటిని ఉచితంగా అందిస్తున్నారు.
- అత్యంత తీవ్రమైన మానసిక వైకల్యం కలిగిన వారికి ప్రధానంగా దినసరి కార్యక్రమాలు(కాలకృత్యాలు)ఎలా చేసుకోవాలో కృత్యాల(యాక్టివిటీ) ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారు. విద్యార్థులతో ఆ పనులుచేయిస్తూ క్రమంగా అలవాటు చేస్తారు. వీరికి భవిత కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఇచ్చే శిక్షణ భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.
- మానసిక దివ్యాంగులకు దృశ్యరూపక వస్తువుల ద్వారా (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు.
- చెవిటి, మూగ విద్యార్థులకు స్పీచ్ థెరపీలో ఫ్లాష్ కార్డు(అక్షరాల బొమ్మ) లిప్ రీడింగ్, టచ్ ద్వారా అక్షరాలు నేర్పిస్తున్నారు.
- దివ్యాంగుల్లో వైకల్య శాతం తగ్గి వారు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకునేలా తర్ఫీదునిస్తారు.

సాధారణ పిల్లలతో మెలిగేలా శిక్షణ



దివ్యాంగ చిన్నారులు మిగతా పిల్లలతో సమానంగా మెలిగేలా శిక్షణ ఇస్తున్నాం. వారిలో వైకల్య తీవ్రతను తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. పిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నాం. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి వద్దనే విద్యను అందిస్తున్నాం. మండలంలోని వేపనపల్లెకు చెందిన అంధ విద్యార్థి రేవతికి భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న ఇంటి వద్దకే విద్య కార్యక్రమం ద్వారా ఇంటికి వెళ్లి చదువు చెప్పాం. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పాసైంది.

–హిమబిందు, ఐఈఆర్టీ, బంగారుపాళెం

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ



భవిత కేంద్రానికి వస్తున్న దివ్యాంగ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. పిల్లల మనోభావాలను అనుసరించి వారికి పాఠాలను చెబుతున్నాం. ఆట పాటలతోనూ వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థులకు అత్యవసరమైన దినసరి చర్యలు స్వయంగా చేసుకునేలా శిక్షణ ఇస్తున్నాం. ఇది వారిలో క్రమంగా అలవాటుగా మారేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– మీరయ్య, ఐఈఆర్టీ, బంగారుపాళెం

పిల్లల్లో మార్పు తీసుకువచ్చేందుకు కృషి



దివ్యాంగులకు వసతులన్నీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. భవిత కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వ పరంగా అందిస్తున్న ఉచిత పథకాలను గుర్తించి తెలియజేస్తున్నాం తల్లిదండ్రులు పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. భవిత కేంద్ర సేవల వివరాలను తెలియజేస్తున్నాం. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ అందించి వారిలో మార్పు వచ్చేందుకు కృషి చేస్తున్నాం.

–నాగేశ్వర్‌రావు, ఎంఈఓ, బంగారుపాళెం

రేపు చిత్తూరుకు రామయ్య రథం

చిత్తూరు రూరల్: రామయ్యకు రథం రెడీ అయింది. ఆలయ నిర్వాహకులు రూ. 25 లక్షలు వ్యయం చేసి తీర్చిదిద్దిన ఈ రథం శనివారం సాయంత్రానికి నగరానికి చేరుకోనుంది. నగరంలోని రాముని గుడివీధిలో శ్రీ కోదండరామస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలోని స్వామివారికి రథం లేదు. శ్రీరామనవమి బ్రహోత్సవాలప్పుడూ రథం కోసం అష్టకష్టాలు పడేవారు. ఇది గమనించిన ఆలయ నిర్వాహకులు పాలకమండలి సమావేశంలో రథం విషయాన్ని చర్చకు తీసుకొచ్చారు. అందరూ కలిసికట్టుగా రథం సిద్ధం చేసేందుకు తీర్మానం చేశారు. ఏడాది క్రితం తమిళనాడులోని తిరుచ్చిలో రథం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏడాది పాటు శ్రమించిన శిల్పులు టేకుతో సుందరంగా తీర్చిదిద్దారు. మొత్తం 32 అడుగుల పొడవుతో, మాడవీధుల్లో రథం సులభంగా తిరిగడానికి వీలుండేలా తయారు చేశారు. శనివారానికి రథం ఆలయం వద్దకు చేరుకుంటుందని ఆలయ అర్చకులు వేణుగోపాల్ తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



చిత్తూరు అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల నూతన క్యాలెండర్, డైరీని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ గురువారం ఆవిష్కరించారు. మునిసిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సయ్యద్ బాషా, నాయకులు రవీంద్రబాబు, జ్యోతీశ్వర్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మహేష్, జ్యోతీశ్వరి, సుధీర, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు కృషి



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ రమాదేవి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి డాక్టర్ దాత్రేయచౌదరి

ఐరాల: గర్భవతులు, బాలింతల్లో రక్తహీనతను నివారించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర ప్రోగ్రాం (నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్) అధికారి డాక్టర్ రమాదేవి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం గర్భవతులలో హిమోగ్లోబిన్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నాయా, లేదా.. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు, ఓపీ, ల్యాబ్ రికార్డులు, ఇతర ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవించేలా అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. గర్భందాల్చిన తర్వాత మాతాశిశు సంరక్షణ కార్డు అందించి నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. పురిటి నొప్పులు వచ్చే సమయానికి సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరేలా ఏఎన్‌ఎంలు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత, డీపీహెచ్ఎన్ఓ రేణుకప్రభు, డీపీఎంఓ రామ్మోహన్, ఎపిడిమియాలజిస్ట్ వాణి పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తవణంపల్లె: గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ దాత్రేయచౌదరి తెలిపారు. మండలంలోని గురుకువారిపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో గర్భవతులు, పిల్లలకు, సాధారణ జబ్బులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. శిబిరంలో 85 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని అన్నారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్న పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పోలవరం పాఠశాలలో వైద్య శిబిరం



విద్యార్థినిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక

పూతలపట్టు: మండలంలోని పోలవరం హైస్కూల్లో గురువారం పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తలనొప్పి, దగ్గు, జ్వరం, చర్మవ్యాధులు వంటి జబ్బులున్న విద్యార్థులను గుర్తించి వారికి తగిన మందులు అందజేశారు. రక్తహీనత కలిగిన విద్యార్థులను గుర్తించి వారికి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ ఇవ్వడానికి పీహెచ్‌సీకి పంపించినట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనంలోని గుడ్డును విద్యార్థులు తినకుండా నిరాకరిస్తుంటే, వారికి కోడిగుడ్డు, క్యాలరీల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, ఎంహెల్‌హెచ్‌పీ నిహారిక, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన

యాదమరి: వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండేందుకు గ్రామీణ ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందికి వైద్యాధికారి అనిల్‌కుమార్ కోరారు. సంతగేటు ప్రభుత్వాస్పత్రిలో గురువారం వడదెబ్బపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేసవిలో బయట తిరిగితే వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, అలాంటి వారికి వెంటనే చికిత్సలు అందించాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణంపై వారికి అవగాహన ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

దివిటివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని దివిటివారిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 104 వైద్య శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను సందర్శించి పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతులు అధికారుల సలహాలు తీసుకోండి



కాశిరాళ్లలో వరిపంటను పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ తదితరులు

యాదమరి: మండల పరిధిలో పంటలు పండించే రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకొని పంటలు పండించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ సూచించారు. మండలంలోని కొనాపల్లె, కాశిరాళ్ల రైతు భరోసా కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి రైతులకు పంటలు పండించే ముందు వారితో మాట్లాడి భూసార పరీక్షలు చేయాలన్నారు. అనంతరం ఎలాంటి ఎరువులు వాడితే పంటలు బాగా పండుతాయో వారికి సూచనలు ఇవ్వాలని కోరారు. కాశిరాళ్ల గ్రామంలో వరి పంటలను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి చరిత తదితరులు పాల్గొన్నారు.

పుష్పపల్లకిపై శివ పార్వతుల చిద్విలాసం





పుష్పపల్లకిపై విహరిస్తున్న శివ పార్వతులు, విశేషాలంకరణలో కొలువైన ఆదిదంపతులు

బంగారుపాళెం: మొగిలి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు గురువారం రాత్రి శివపార్వతులైన శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ పుష్పపల్లకిపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకపూజలు నిర్వహించారు. రాత్రి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి పుష్పవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ పుర వీధుల్లో మేళతాళాల నడుమ స్వామి, అమ్మవారు విహరిస్తూ భక్తులకు దివ్యాశీసులను అందజేశారు. పుష్పపల్లకి ఉత్సవానికి బొమ్మాయిపల్లెకు చెందిన మమత, ఈశ్వర్ నాయుడు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజ, వంశ పారంపర్య ధర్మకర్త విజయకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు రెడ్డెప్ప గురుకుల్, అర్చకులు పాల్గొన్నారు.

నేడు ధ్వజావరోహణం

మొగిలీశ్వరస్వామివారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సూర్య ప్రభ వాహనం, సాయంత్రం వసంతోత్సవం, త్రిశూలస్నానం, ధ్వజావరోహణం, రాత్రి చంద్రప్రభ వాహనం, శయనోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. భక్తులందరూ తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

‘విద్యుత్తు’ ధర్మం నిర్వర్తిస్తున్నారు!



చిత్తూరులో తనిఖీ చేస్తున్న ఏఈ బాలచంద్ర

ఎంతమంది విందుకు హాజరవుతారో తెలిస్తే అంతమందికి మంచి వంటకాలను సిద్ధం చేయవచ్చు. అలా కాకుండా వంద మందికి భోజనం తయారు చేస్తే 150 మంది వస్తే అంతా అగమ్యగోచరం.. అలాగే ఉంది విద్యుత్ సరఫరా పరిస్థితి కూడా. వినియోగానికి, ఉత్పత్తికి మధ్య తేడా వస్తే విద్యుత్ అంతరాయాలు, కోతలు అనివార్యమవుతాయి. అందుకే ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ చౌర్యంపై నిఘా పెట్టి, కొరడా ఝుళిపిస్తున్నారు. వారి విద్యుత్తుధర్మం నిర్వర్తిస్తున్నారు.

- విద్యుత్ చౌర్యంపై నిఘా
- ఏడాదిలో 3,616 కేసులు నమోదు
- రూ.1.60 కోట్లు అపరాధ రుసుం

చిత్తూరు కార్పొరేషన్: అక్రమార్కుల చర్యలతో విద్యుత్ శాఖకు జరుగుతున్న నష్టంపై ట్రాన్స్‌కో అధికారులు ఉక్కుపాదం మోపారు. చౌర్యానికి పాల్పడుతున్న వినియోగదారుల సర్వీసుల నిరంతరంగా తనిఖీ చేసి కోట్లాది రూపాయల అపరాధ రుసుం విధించి, వసూలు చేస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తూ అనధికారికంగా విద్యుత్ వాడుతున్న వారి సంఖ్యగణనీయంగా తగ్గించే చర్యలు తీసుకుంటున్నారు. చిత్తూరు అర్బన్ పరిధిలో తరచూ తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. గత సంవత్సర కాలంలో మొత్తం 20 వేలకుపైగా సర్వీసులు తనిఖీలు చేసి 3,616 కేసులు నమోదు చేసి రూ.1.60 కోట్లు అపరాధ రుసుం విధించారు.

కేటగిరి వారీగా సర్వీసులు	
గృహ సర్వీసులు	1,48,356
వాణిజ్యం	20,493
పరిశ్రమలు	3,614
వాటర్‌వర్క్స్	5,383
వ్యవసాయం	36,152

డివిజన్‌లో తనిఖీలు

ఏడాదిగా ట్రాన్స్‌కో అధికారులు చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో అక్రమాల అంతు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. చిత్తూరులోని సంతపేట, మిట్టూరు, కేఆర్‌పల్లె, గిరింపేట, చిత్తూరు రూరల్స్ పరిధిలోని గుడిపాల, చిత్తూరు రూరల్, పూతలపట్టు, పెనుమూరు, జీడీనెల్లూరు, ఎస్ఆర్‌పురం, ఆవులకొండ, పాలసముద్రం, ప్రాంతాల్లో ట్రాన్స్‌కో పరిధిలో దాడులు విస్తృతంగా నిర్వహించారు. ఈ దాడుల్లో ఎక్కువగా నగర, పట్టణ శివార్లు, కాలనీల పరిసర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి ముందు నుంచే విద్యుత్ లైన్ వెళ్తుంది కదా.. కర్రకు వైర్లు చుట్టి లైన్‌కు తగిలించేద్దామని చౌర్యానికి పాల్పడుతున్నారు. మీటర్‌లో రీడింగ్ నమోదు కాకుండా చేస్తున్నారు. సాంకేతికంగా మీటర్ బాక్స్‌కు ఒక వైర్ వేసి రీడింగ్ నమోదు కాకుండా చేసి, విద్యుత్ వాడుతున్నారు. గృహ సర్వీసు కేటగిరి కింద సర్వీసు తీసుకుని వాటిని వాణిజ్య కేటగిరీకి వాడుతున్నారు. సాధారణంగా ఇంట్లో వంటగది కచ్చితంగా ఉంటుంది. అప్పుడే గృహ సర్వీసు కింద కనెక్షన్ ఇస్తారు. కొందరు ఇంట్లో అంగడి, గోడౌన్, వాణిజ్య కార్యకలాపాలాకు గృహ సర్వీసు కింద వినియోగిస్తున్నారు. డైరెక్ట్ ట్యాపింగ్, మాల్‌ప్రాక్టీస్, అదనపు లోడ్, బ్యాక్ బిల్లింగ్ తదితర కేసులు నమోదు చేశారు.

1912కు ఫిర్యాదు చేయండి



విద్యుత్ చౌర్యం చేయడం నేరం... ఇలాంటివి ఎక్కడైనా జరిగితే నేరుగా 1912 నంబర్‌కు ఫిర్యాదు చేయండి. ఇందుకోసం తిరుపతిలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తున్నాం. చౌర్యం చేయవద్దు, వీటిపై నిఘా పెట్టి ప్రతివారం తనిఖీలు చేస్తున్నాం. అందులో పట్టుబడిన సర్వీసులకు అపరాధ రుసుం విధిస్తున్నాం.

- పద్మనాభపిళ్లై, ఇన్‌చార్జి ఈఈ, ట్రాన్స్‌కో

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

తవణంపల్లె: సచివాలయంలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డ్వామా పీడీ గంగాభవాని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆమె గురువారం మండలంలోని అరగొండ సచివాలయం తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం కొండ్రాజుకాలువలో ఉపాధి నిధులతో జరుగుతున్న కట్ట అభివృద్ధి పనులను పరిశీలించారు. వేసవిలో ఉపాధి పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ లలిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.4 లక్షలకు వాహనాల వేలం

బంగారుపాళెం: వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.1.44 లక్షల ఆదాయం వచ్చినట్లు గురువారం ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలో అక్రమ మద్యం కేసులో పట్టుబడిన 10 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు సెబ్ అధికారులు, సీఐ నరసింహారెడ్డి పాల్గొన్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఎరువు దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

చిత్తూరు రూరల్: నగరంలోని పలు ఎరువు దుకాణాలపై శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు శివకుమార్, వేణుగోపాల్ తనిఖీలు నిర్వహించారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్లను చూశారు. లోటుపాట్లు, నాణ్యత తదితర అంశాలపై ఆరా తీశారు. నిబంధనలను పాటించడంతోపాటు నిర్ణీత ధరకే ఎరువులను విక్రయించాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేయక తప్పదని ఆయన దుకాణదారులను హెచ్చరించారు.

యాదమరిలో ట్రాఫిక్ చిక్కులు



బజారులో గొడవపడుతున్న వాహనదారులు

యాదమరి: మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. చిత్తూరు–గుడియాత్తం రహదారి ఇక్కడ ఉండడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మెయిన్ బజారులో వాహనాలు ఎక్కడ పడితే అక్కడ ఆపేయడంతో వాహనదారులు ఘర్షణలకు దిగుతున్నారు. అయినా పోలీసులు మాత్రం చోద్యం చూస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది.

ఇంటర్ ఓపెన్ అడ్మిషన్లు ప్రారంభం

ఐరాల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఓపెన్ స్కూల్ మంజూరైందని ఇందుకు గాను 2022–23 సంవత్సరానికి సంబంధించి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు తెలిపారు. సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం, గతంలో పదవ తరగతి పాసై డ్రాప్ అయిన విద్యార్థులు ఈ నెల 27వ తేదీలోపు అడ్మిషన్ పొందవచ్చని చెప్పారు.

రేపు సంగీత ధ్యాన కచేరి

తవణంపల్లె: మండలంలోని సిద్ధంపల్లె సమీపంలో ఉన్న శ్రీ విఘ్నేశ్వర మహా పిరమిడ్ శక్తి కేంద్రంలో ఆదివారం తిరుమల–తిరుపతి దేవస్థానం వారిచే సంగీత ధ్యాన కచ్చేరి నిర్వహించనున్నట్లు జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ క్షేత్రం సొసైటీ అధ్యక్షులు గోపాలక్రిష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ధ్యానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

28న మండల సర్వసభ్య సమావేశం

యాదమరి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ఎంపీపీ సురేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

సైన్స్ దినోత్సవం

పలమనేరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 28న జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంఈవో లీలారాణి సూచించారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో మండలంలోని సీఆర్పీ సెక్రటరీలు, సీఆర్‌పీలకు కార్యక్రమ నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులు భావిభారత సైంటిస్టులుగా ఎదగాలంటే పాఠశాలలే వేదికలని తెలిపారు. ఉపాధ్యాయులు సైన్స్‌పట్ల పిల్లలకు ఆసక్తిని కలిగించాలని సూచించారు. మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిటైర్డ్ వీఆర్వో దౌర్జన్యం

వెదురుకుప్పం: రిటైర్డ్ వీఆర్వో ఆక్రమణలకు అడ్డు అదుపులేకుండా పోతోంది. ఏకంగా జగనన్న కాలనీకి వెళ్లే దారిని దౌర్జన్యంగా ఆక్రమించి, దారి లేకుండా చేశాడు. 15 రోజులుగా దారికి అడ్డంగా రాళ్లు తోలి, వెళ్లనీయకుండా అడ్డగిస్తున్నాడని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మారేపల్లె గ్రామానికి సమీపంలో పేదలందరికీ ఇళ్ల పథకంలో 12 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కాలనీకి వెళ్లేందుకు దారి సౌకర్యం ఏర్పరిచారు. అయితే ఆ దారిని రిటైర్డ్ వీఆర్వో టి. దేవరాజులురెడ్డి ఆక్రమించుకుని రోడ్డుకు అడ్డంగా రాళ్లు తోలి దారి లేకుండా అడ్డగిస్తూ ఇబ్బందులు గురిచేస్తున్నాడని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దారి సక్రమంగా లేక అడ్డంకులు కలిగిస్తున్నారని సర్పంచ్ అన్నురాశి తెలిపారు.



దారికి అడ్డంగా పోసిన రాళ్లు

ఉన్నది ఒకటి.. చెప్పేది ఇంకోటి

- కచ్చితత్వం లేని రోగ నిర్ధారణ పరీక్షలు
- అనుమతి లేని ల్యాబొరేటరీలు
- ఫిజియోథెరపీ కేంద్రాలు, క్లినిక్‌లదీ అదే తీరు
- దాడులకు సిద్ధమైన అధికారులు

– చిత్తూరు నగరంలోని పొన్నియమ్మ గుడివీధిలో ఓ డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఈ కేంద్ర నిర్వహణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేశారు. తనిఖీలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని తెలుసుకుని, వెంటనే తాళం వేయాలని ఆదేశించారు.

– చర్చివీధిలోని ఓ క్లినిక్ నడిపేందుకు అనుమతి తీసుకున్నారు. అందులోనే ల్యాబొరేటరీ ఏర్పాటు చేశారు. దానికి మాత్రం ఎలాంటి అనుమతులు లేవు. క్లినిక్ లైసెన్స్‌ను అడ్డం పెట్టుకుని ల్యాబొరేటరీని నడుపుతున్నారు. దీనిపై వారం రోజుల కిందట అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో జిల్లా వ్యాప్తంగా జల్లెడ పట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాలు, అర్హత లేని టెక్నీషియన్స్ ఇచ్చే రోగ నిర్ధారణ నివేదికల వల్ల రోగుల ప్రాణాలమీదకు వస్తోంది. అనుమతి లేని ల్యాబ్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చేశాయి. వీటిల్లో రోగ నిర్ధారణ నివేదికలు తప్పుల తడకగా ఇస్తున్నారు. దీంతో రోగులకు ఉన్న జబ్బు తగ్గకపోగా, కొత్త రోగాలు వస్తున్నాయి. ఆలస్యంగా తేరుకున్న బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.



చిత్తూరులో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న డయాగ్నస్టిక్ కేంద్రం(ఫైల్)

చిత్తూరు రూరల్: నగరంలో అనుమతులు లేకుండా పలు ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, లేబొరేటరీలు నిర్వహిస్తున్నారు. వీరి వల్ల రోగుల ప్రాణాలకు ముప్పు తలెత్తితే ఎవరిది బాధ్యత అనే ప్రశ్న తలెత్తుతోంది. ఒక్కో లేబొరేటరీ, స్కానింగ్ సెంటర్ ఇస్తున్న రిపోర్టులకు పొంతన ఉండడం లేదు. ఇలాంటి కచ్చితత్వం లేని రిపోర్టుల ఆధారంగా ప్రైవేట్ వైద్యశాలల్లో వైద్యం చేస్తున్నారు. ఫలితంగా వైద్యం వికటించి ప్రాణాపాయం తలెత్తిన పరిస్థితులూ ఉన్నాయి. ఇదే విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో అధికారులు ల్యాబ్‌లపై దాడులు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. పట్టుబడితే కేసు పెట్టే యోచనలో ఉన్నారు.

అనుమతులు కొన్నింటికే..

వైద్యారోగ్యశాఖ వద్ద ఉన్న గణాంకాల మేరకు జిల్లాలో క్లినిక్‌లు 16, పడకల ఆస్పత్రులు 72, ల్యాబ్‌లు 25, స్కానింగ్ సెంటర్లు 38 వరకు అనుమతులు తీసుకున్నట్లు తెలుస్తోంది. అనుమతులు లేకుండా దాదాపు 92 వరకు క్లినిక్‌లు, ఆస్పత్రులు ఉన్నట్లు సమాచారం సేకరించారు. ల్యాబ్‌లు 42 వరకు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని ఆస్పత్రుల లైసెన్స్ గడువు ముగిసినప్పటికీ పునరుద్ధరణ చేసుకోవాల్సినవి చాలా ఉన్నాయి. అయితే గడువు ముగిసిన సంస్థలు రెన్యువల్ చేసుకోవాలని ఉత్తర్వులు ఉన్నా అమలుకు నోచుకోలేదు. కొన్ని లేబొరేటరీలు డెంగీ, మధుమేహం, బీపీ, మలేరియా, ఇతర పరీక్షలు నిర్వహిస్తూ ప్రజల నుంచి పెద్ద మొత్తంలో దోచుకుంటున్నారు.

ఇవన్నీ తప్పనిసరి

ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు లేబొరేటరీలు, డెంటల్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఫిజియోథెరపీ యూనిట్లు ఏర్పాటు చేయాలంటే వివిధ విభాగాల నుంచి అనుమతులు తప్పనిసరి. వీటిని ఏర్పాటు చేసే భవనాలకు మున్సిపల్/పంచాయతీ అనుమతులు, అగ్నిమాపక శాఖ, ఐఎంఏ సభ్యత్వం, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, వైద్య పరీక్షల సామగ్రి వివరాలు, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతి, స్పెషలిస్టు వైద్యులు, నర్సులు, ఫార్మసీ సిబ్బంది, ఆడిట్ నివేదిక, ఇలా అన్ని రకాల అనుమతులతో రిజిస్ట్రేషన్ కు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ వ్యయప్రయాసాలతో కూడుకున్నవి కావడంతో, ఎలాంటి అనుమతుల్లేకుండా కేంద్రాలు పుట్టుకొస్తున్నాయి. ఇలాంటి వాటిపై ప్రజలే నేరుగా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో అధికారులు వాటి వివరాల సేకరణలో పడ్డారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రైవేట్ ఆస్పత్రులు, లేబొరేటరీలు, డయాగ్నస్టిక్ సెంటర్లు, క్లినిక్‌లు డెంటల్ ఆస్పత్రులు, ఫిజియోథెరపీ యూనిట్లు రిజిస్ట్రేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిత మొత్తాన్ని రుసుంగా నిర్ణయించింది. ప్రతి ఐదేళ్లకు రుసుం క్లినిక్ రూ.1,250, పాలీక్లినిక్‌కు రూ.2,500, 20 పడకల ఆస్పత్రి రూ.3,750, 21 నుంచి 50 పడకల ఆస్పత్రి రూ.7,500, 101 నుంచి 200 పడకలు దాటిన ఆస్పత్రికి రూ.37,500, లేబొరేటరీకి రూ.2,500, డయాగ్నస్టిక్ సెంటర్‌కు రూ.10,000, ఫిజియోథెరపీ యూనిట్‌కు రూ. 3,750 చొప్పున రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించాలి. కానీ ఏపీపీఎంసీ ఈ చట్టం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం వీటిని నిర్వహించడంతో నిర్వాహకులు అనుమతులు తీసుకోవడం లేదని తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం



ప్రైవేట్ ఆస్పత్రులు వైద్య సంస్థలు ఏపీపీఎంసీఈ చట్టం ప్రకారం విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకుని గడువు ముగిసినా సంస్థలు రెన్యువల్ చేసుకోవాలి. వీటిని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. త్వరలోనే తనిఖీలు నిర్వహించి అనుమతులు లేని ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటాం.
– రవిరాజు, పీసీ అండ్ పీడీటీ

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని జి.ఎర్రేపల్లె ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులు, మరుగుదొడ్లు, జగనన్న గోరుముద్ద పథకం అమలను పరిశీలించారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించాలని, సిలబస్ ప్రకారం విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మంచి ఉత్తీర్ణ సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు.

నేడు ఐరాల మండల సర్వసభ్య సమావేశం

ఐరాల: మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎంపీడీఓ నిర్మలాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

నగరంలో పూర్తిస్థాయి విద్యుత్ దీపాలు



విద్యుత్ దీపాల పరిశీలనలో కమిషనర్ అరుణ, ఇంజినీరింగ్ అధికారులు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ అరుణ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను పరిశీలించారు. కొండారెడ్డిపల్లి పరిధిలోని పుత్తూరు రోడ్డులో విద్యుత్ దీపాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు కోసం సత్వరం సమగ్ర సర్వే నిర్వహించాలని, ఏ ప్రాంతాల్లో ఎన్ని విద్యుత్ దీపాలు అవసరమో నివేదికలు తయారు చేయాలన్నారు. పాడైన విద్యుత్ దీపాల మరమ్మతులను పూర్తిస్థాయిలో చేయించాలన్నారు. అనంతరం కమిషనర్ స్థానికంగా పలు హోటళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిల్వ చేసిన మాంసం, ఇతర ఆహార పదార్థాలను వినియోగించరాదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈ ధనలక్ష్మీ, డీఈలు రమణ, వెంకట ప్రసాద్, ఏఈ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు అర్బన్: నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ ప్రార్థన మందిరంలో ఆదివారం ఆ సంఘ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో తిరుపతి అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పీఈఎస్‌లో..

యాదమరి: మండల పరిధిలోని బెంగళూరు–చెన్నై జాతీయ రహదారిలోని మోర్దానపల్లె వద్ద ఉన్న పీఈఎస్ పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. పీఈఎస్ సంస్థలు స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థల అధినేత దొరస్వామి నాయుడు తెలిపారు.

పరిశీలకులతో ఆర్‌వోలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాకు విచ్చేసిన ఎన్నికల అబ్జర్వర్‌లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్‌ను జిల్లా ఎన్నికల ఆర్‌వోలు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, కలెక్టర్ హరి నారాయణన్, జేసీ వెంకటేశ్వర్ అబ్జర్వర్‌లను కలిసి పలు అంశాలపై చర్చించారు.

సూర్యచంద్ర ప్రభలపై మొగిలీశ్వరుడు





సూర్య ప్రభ, చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగుతున్న మొగిలీశ్వరుడు, కామాక్షమ్మ

బంగారుపాళెం: మొగిలి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజు శుక్రవారం ఉదయం మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారు సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దివ్యాశీస్సులను అందించారు. స్వామి, అమ్మవారి మూలవర్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి సూర్య ప్రభవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం వసంతోత్సవం, త్రిశూలస్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి మొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ చంద్రప్రభ వాహనంపై అధిరోహించి మాడ వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. చివరగా స్వామి, అమ్మవారికి శయనోత్సవాన్ని నిర్వహించారు. సూర్యప్రభ వాహన సేవకు నలగాంపల్లె కేఎస్ఎన్ ఫుడ్స్ యజమాని నరసింహులునాయుడు, మునెమ్మ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించగా, వసంతోత్సవం, త్రిశూలస్నానం, ధ్వజావరోహణం, చంద్ర ప్రభ వాహన సేవ కార్యక్రమాలకు దేవస్థానం వారు ఉభయ దారులుగా వ్యవహరించారు. శయనోత్సవానికి మొగిలి బ్రాహ్మణ సంఘం, అర్చకులు, పురోహితులు ఉభయ దారులుగా వ్యవ హరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజ , వంశపారం పర్య ధర్మకర్త విజయ కుమార్ పాల్గొన్నారు.

నేడు తెప్పోత్సవం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి, అమ్మ వారికి అభిషేకం, రాత్రి తెప్పోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

‘ఫ్యామిలీ ఫిజీషియన్’పై అవగాహన

బంగారుపాళెం: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంపై వైద్య ఆరోగ్య సిబ్బందికి క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ అన్నారు. మండలంలోని తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుక్రవారం ఆరోగ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందేనన్నారు. క్షేత్ర స్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు దీనిపై ప్రజలకు అవగాహన కలిగించాలని చెప్పారు. మహిళా వైద్యాధికారి డాక్టర్ శిరీష మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యపథకాలను పేద ప్రజలకు అందేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. గ్రామ సచివాలయాల వారీగా సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ క్యాంప్‌లో బీపీ, షుగర్, టీబీ, లెప్రసీ వ్యాధిగ్రస్తులను హాజరయ్యేలా ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ సమీమ్, ఎంపీహెచ్ఈఓలు బృహస్పతి, రమేష్‌బాబు సూపర్‌వైజర్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: సమావేశంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్

నగరంలో ఫ్యామిలీ ఫిజీషియన్

చిత్తూరు అర్బన్: నగరంలోని ఎల్‌బీపురం ప్రాంతంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను నిర్వహించారు. చికిత్స కోసం అక్కడికి వచ్చిన వారికి వైద్య సిబ్బంది ఎత్తు, బరువు కొలిచారు. ఆపై అవసరమైన వారికి బీపీ, మధుమేహ పరీక్షలు చేసి వైద్యులు చికిత్స అందించారు. మందులు, మాత్రలు పంపిణీ చేశారు. తరువాత లేవలేని స్థితిలో ఉన్నవారి ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని..తగిన మాత్రలు అందించారు. ఫిజీషియన్ సేవలకు మొత్తం 125 మంది వచ్చినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సుదర్శన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురం తహసీల్దార్‌పై ఫిర్యాదు

చిత్తూరు కలెక్టరేట్: విజయపురం తహసీల్దార్‌పై స్థానిక సంస్థల ఆర్‌వో వెంకటేశ్వర్‌కు శుక్రవారం పలువురు ఫిర్యాదు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థికి చెందిన ఓటు హక్కును ఆమోదించలేదని, తగిన ధృవపత్రాలు ఇవ్వకుండా కాలయాపన చేశారని, విజయపురం తహసీల్దార్‌పై టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్, సర్పంచ్ మురళి, రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ స్థానిక సంస్థల రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై విచారణ చేయనున్నట్లు ఆర్‌వో తెలిపారు.

ఆక్వాతో యువతకు ఉపాధి



జగనన్నఫిష్‌మార్కెట్‌లో చేపలను పరిశీలిస్తున్న కృపాలక్ష్మి, లత

కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం ఆక్వాపై ప్రత్యేక దృష్టి సారించి, యువతకు ఉపాధి కల్పిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకురాలు కృపాలక్ష్మి అన్నారు. ఆమె శుక్రవారం మండల కేంద్రంలో జగనన్న ఫిష్ మార్కెట్‌ను ఎంపీపీ లతతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగానికి పెద్దపీట వేయడమే కాకుండా మండల కేంద్రాల్లో జగనన్న ఫిష్ మార్కెట్లు ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి కల్పించడానికి కృషి చేస్తోందన్నారు. ఫిష్ మార్కెట్లు ఏర్పాటు చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో సముద్రపు చేపలు సరసమైన ధరలకే అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ జగనన్న ఫిష్ మార్కెట్లకు ప్రభుత్వమే చేపలను పంపిణీ చేస్తోందని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని చెరువుల్లో ఉండే అన్ని రకాలైన చేపలను ప్రభుత్వమే కొనుగోలు చేసి, జగనన్న ఫిష్ మార్కెట్లోకి తరలించి, ఆక్వా రైతులను ఆదుకుంటోందని చెప్పారు. అనంతరం జగనన్న ఫిష్ మార్కెట్‌ను ప్రారంభించి, ప్రభుత్వం పంపిణీ చేసిన సముద్ర చేపలతో పాటు, రొయ్యలు, పీతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, పట్టణ మహిళా అధ్యక్షురాలు మోహనకుమారి, కోఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివప్రకాష్, పార్టీ సీనియర్ నాయకులు శేఖర్‌రాజు, చందురాజు, వెంకటరత్నం, ధనశేఖర్‌వర్మ, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, దాము, పురందర్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి స్వర్ణ రథానికి తొలి వసంతం

- ప్రతి నెలా మాడ వీధుల్లో ఊరేగుతున్న స్వర్ణరథం
- రథం తయారీకి టీటీడీ సహకారం
- వైకుంఠవాసుడి తరువాత ఈ గణపయ్యకే బంగారు వైభవం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి స్వర్ణ రథం తొలి వసంతం పూర్తి చేసుకుంది. గత సంవత్సరం ఫిబ్రవరిలో కాణిపాకం మాఢ వీధుల్లోకి వచ్చిన స్వర్ణరథం భక్తులకు కనువిందు చేసింది. అప్పటి నుంచి ప్రతి నెలా సంకటహర చతుర్థి వ్రతం రోజు స్వామివారి సర్ణరథాన్ని ఊరేగిస్తున్నారు. ఇలా ఏడాదిపాటు దిగ్విజయంగా స్వామివారు స్వర్ణరథంపై భక్తులకు దర్శనం ఇస్తున్నారు.



ఆలయ మాడ వీధులలో ఊరేగుతున్న స్వర్ణరథం (ఫైల్)

ఈ స్వర్ణరథం ఏళ్ల నాటి కల

స్వర్ణరథంలో వినాయక స్వామివారిని ఊరేగించాలని ఆలయ పాలకమండలి సభ్యులు, గ్రామస్థులు, భక్తులు, ప్రజాప్రతినిధులు 17 ఏళ్ల ముందు సంకల్పించారు. వెంటనే ఆలయ అధికారులు టీటీడీ అధికారులను సంప్రదించారు. వారు తయారు చేసి ఇవ్వడానికి ముందుకు వచ్చారు. స్వర్ణ రథం తయారీకి అవరమైన నిధుల సేకరణకు ప్రత్యేకంగా హుండీలు ఏర్పాటు చేసి, దాతల నుంచి విరాళాలు సేకరించారు. ఈ క్రమంలో 2010లో స్వర్ణ రథం కోసం రూ.కోటి టీటీడీకి జమ చేశారు. అనంతరం రూ.5 కోట్లు అందించారు. మొత్తం కలిపి కాణిపాక ఆలయ అధికారులు టీటీడీకి రూ.6.70 కోట్లు నిధులను జమ చేశారు. స్వర్ణ రథానికి బంగారు తాపడానికి టీటీడీ 15 కిలోల బంగారాన్ని దేవాదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు సమకూర్చింది. గత సంవత్సరం ఫిబ్రవరిలో విశాఖ శారద పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలు శాస్త్రోక్తంగా పూజలు చేసి ఈ స్వర్ణ రథం ప్రారంభించారు. ఈ స్వర్ణ రథం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి తరువాత, కాణిపాకంలోని స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి మాత్రమే ఉంది. అందుకే కాణిపాకంలో ప్రతి నెలా నిర్వహించే బంగారు రథోత్సవానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

మరిన్ని ఆర్జిత సేవలు



కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం మరిన్ని పూజా కార్యక్రమాలు, ఆర్జిత సేవలు చేపడుతున్నాము. గత సంవత్సరం స్వర్ణ రథాన్ని అందరి సహకారంతో ప్రారంభించాం. ప్రస్తుతం ఆలయంలో నూతనంగా రెండు ఆర్జిత సేవలు సహస్రనామార్చన, ఉదయాస్తమాన సేవలు మార్చి 4, 5 తేదీల నుంచి ప్రారంభించనున్నాం. మార్చి 3,4,5 తేదీల్లో విశాఖ శారద పీఠాధిపతులతో లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనము చేపట్టనున్నాం.
–మోహన్ రెడ్డి, ఆలయ చైర్మన్ కాణిపాకం